క్లుప్తంగా

జిల్లా ప్రధాన న్యాయమూర్తితో ఎస్పీ భేటీ



జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధికి పూలమొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ బింధుమాదవ్

కర్నూలు: జిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధిని ఎస్పీ బింధుమాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. పెండింగ్ కేసులను తగ్గించడానికి లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా న్యాయ శాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయడంపై ఇరువురూ చర్చించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేలా పోలీసు శాఖ తరపున కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలో రహదారులపైకి పశువులను వదిలితే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రహదారులపై గేదెలు, ఆవులు, ఎద్దులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని,దీని వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తు తోందని వివరించారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరిస్తున్నా, జరిమానాలు విధిస్తున్నా, గో శాలకు తరలిస్తున్నా యజమానులు మారడం లేదని పేర్కొన్నారు. యజమానులు మారకుంటే ప్రజారోగ్య చట్టం, పోలీసు, ట్రాఫిక్ నియంత్రణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒలింపిక్ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలి

కర్నూలు (టౌన్): ఒలంపిక్స్‌లో పాల్గొంటున్న క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని రాణించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో గురువారం జిల్లా స్థాయి రగ్బీ అంతర్ పాఠశాలల పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుండే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని సాధన చేయాలన్నారు. చదువు, క్రీడలను ఎంచుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల విడుదల

కర్నూలు(సెంట్రల్): ఆర్‌యూ పరిధిలో జనవరి–2024లో నిర్వహించిన డిగ్రీ ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ ఎన్‌టీకే నాయక్ విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 1,609 మందికిగాను 261 మంది, రెండో సెమిస్టర్‌లో 2,555 మందికిగాను 874 మంది పాసయ్యారు. కనీసం 50 శాతం మంది విద్యార్థులు కూడా పాస్ కాకపోవడం గమనార్హం.

నిత్యావసర సరుకుల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు పట్టణంలోని సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఇకో డెవలప్‌మెంట్(స్రెడ్) ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులకు గురువారం ఉచితంగా నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జి.వెంకటరత్నం మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులు క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు తీసుకోవడం వల్ల వైరల్ లోడ్ తగ్గి ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాధితులకు పోషకాహారం పంపిణీతో పాటు సామాజిక సమస్యల పరిష్కారం కోసం తమ సంస్థ పనిచేస్తుందని తెలిపారు. డీఎంఈ దేవిశం కర్‌గౌడ్, ప్రాజెక్టు మేనేజర్ ఎస్.మునీర్ అహ్మద్, స్రెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

20న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఈ నెల 20వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత చెప్పారు. కర్నూలు వీకర్‌సెక్షన్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన విఫ్స్ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చేతుల అపరిశుభ్రతతోనే అనేక పురుగులు పిల్లల పొట్టలోకి చేరుతాయన్నారు. పెరిగిన గోళ్లలో ఇరుక్కుపోయిన మట్టితో కూడా పురుగుల గుడ్లు పొట్టలోకి వెళ్లి నులిపురుగులు, కొంకి పురుగులు, బద్దె పురుగులు, కొరడా పాములు, ఏలిక పాములు, దారపు పురుగులు తయారవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ మాలిక ఖాన్, సచివాలయ ఆరోగ్య కార్యకర్త సత్యా సులోచన, పాపమ్మ, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.







సత్యనారాయణస్వామి ఆలయంలో నాగ ప్రతిమలకు పాలు పోస్తున్న భక్తులు, స్వామిరెడ్డి నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో నాగులకట్టకు పూజలు, మెడికల్ కాలేజీ శివాలయంలో..







వడ్డెగేరిలో నాగదేవత విగ్రహానికి పాలు పోస్తున్న యువతి, విగ్రహానికి పాలు పోస్తున్న మహిళ, బుధవారపేటలో నాగుల కట్టకు పూజలు

● ఘనంగా నాగుల చవితి

శ్రావణమాసం ప్రారంభం కావడంతో నాగుల చవితిని పురస్కరించుకొని మహిళలు నాగుల కట్టలు, పుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలలితాపీఠం, మెడికల్ కాలేజీ తదితర చోట్ల కొత్తగా పెళ్లి అయిన దంపతులతోపాటు భార్యభర్తలు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సమీపంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

వక్ఫ్ భూముల బిల్లును వెనక్కు తీసుకోవాలి

కర్నూలు (అర్బన్): పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు భూముల ప్రతిపాదన బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెనక్కు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.బాబురావు కోరారు. ఆయన గురువారం స్థానిక డీసీసీ కార్యాలయంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 40 సవరణలు చేసేందుకు బిల్లు పెట్టారన్నారు. దేశంలో రైల్వే, రక్షణ శాఖల తర్వాత వక్ఫ్ బోర్డు ఆస్తులు అధికంగా ఉన్నాయన్నారు. వక్ఫ్ బోర్డు భూముల విషయంలో బిల్లు పెట్టడం, కులాలు, మతాల మధ్య చిచ్చు పె ట్టేందుకే అని అన్నారు. పార్లమెంటులో పెట్టిన బి ల్లును రాష్ట్రంలోని పార్టీలు వ్యతిరేకించాలని కోరారు.

13న విజయవాడలో వర్క్‌షాప్

కర్నూలు (సెంట్రల్):ఐదేళ్ల ప్రగతి ప్రణాళిక రూపకల్పనపై అవగాహన కోసం ఈ నెల 13న విజయ వాడలో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. వర్క్‌షాప్‌నకు జిల్లా నుంచి డీఎంహెచ్‌ఓ, డీఈఓ, ఏపీఐఐసీ జెడ్ఎం సీపీఓ, సీపీఓ కార్యాలయ డీవైఎస్‌ఓ హాజరుకానున్నారు. వీరు అక్కడ తెలుసుకున్న అంశాలపై 15, 16 తేదీల్లో జిల్లా అధికారులకు కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తారు. ఐదేళ్ల ప్రణాళిక నివేదికను సెప్టెంబర్ ఆఖరు నాటికి పూర్తి చేసి అక్టోబర్ 2 నుంచి అమలు చేయాల్సి ఉంటుంది.

వీధి దీపాల సమస్యకు పరిష్కారం



విద్యుత్ స్తంభానికి సీసీఎంఎస్ బాక్సు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కర్నూలు (టౌన్): నగరంలో వీధి దీపాల సమస్యలను పరిష్కరించే విధంగా నగరపాలక యంత్రాంగం సరికొత్త పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటోంది. ఆ దిశగా నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ చర్యలు చేపట్టారు. స్థానికంగా ప్రజల నుంచి వీధిలైట్ల సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. వీధిలైట్లు వెలగడం లేదన్న ఫిర్యాదులను పరిష్కరించే దిశగా సీసీఎంఎస్ (సెంట్రలైజ్డ్ కంట్రోల్, మానిటరింగ్ సిస్టమ్) బాక్సులను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని 25 వేల వీధి దీపాల నిర్వహణను 986 సీసీఎంఎస్ బాక్సుల ద్వారా తెలుసుకోవచ్చు. క్షణాల్లో సమాచారం తెలియడం ద్వారా వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేసే అవకాశం ఉంటుందని నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ గురువారం వెల్లడించారు.

ఆస్పిరేషన్ బ్లాక్ లక్ష్యాలు సాధించాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా అధికారులు

కర్నూలు(సెంట్రల్): ఆస్పిరియేషన్ బ్లాక్ కార్యక్రమంలో నిర్దేశించుకున్న లక్ష్యాలకు సంబంధించి సెప్టెంబర్ 30వ తేదీలోపు పురోగతి సాధించాలని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం అధికారులను ఆదేశించారు. గురువారం ఢిల్లీలోని నీతి ఆయోగ్ కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పిరేషన్ బ్లాకుల్లో భాగంగా దేశవ్యాప్తంగా వెనుకబడిన 500 మండలాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆయా బ్లాకుల్లో 39 నిర్దేశిత విభాగాల్లో పురోగతి కోసం లక్ష్యాలను ముందుంచినట్లు వివరించారు. ముందుగా 6 విభాగాల్లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో ద్వారా 3 నెలల్లోపే గర్భిణులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయడం, డయాబెటీస్, హైపర్‌టేషన్‌ను పూర్తిస్థాయిలో స్క్రీనింగ్ చేయడం, ఐసీడీఎస్ ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, రైతులకు సాయిల్ పరీక్షలు నిర్వహించి కార్డులు జారీ చేయడం, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రివ్వాల్వింగ్ ఫండ్‌ను ఇవ్వడం లక్ష్యాలను సెప్టెంబర్ 30లోపు సాధించాలని సూచించారు. జిల్లాలో అస్పిరేషన్ బ్లాకుల్లో భాగంగా మద్దికెర, చిప్పగిరి, హోళగుంద మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీఓ హిమాప్రభాకరరాజు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ భాస్కర్, ఇన్‌చార్జ్ ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ సలీం బాషా, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో సౌకర్యాల కల్పనకు కృషి



ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆయన గురువారం ఆసుపత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. ఆర్థో విభాగంలో బాత్‌రూమ్ డోర్ల మరమ్మతులను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్థో మేల్ వార్డులో రోగుల వద్దకే వెళ్లి మందులను ఇవ్వాలని నర్సింగ్ సిబ్బందికి సూచించారు. అన్ని విభాగాల్లో పాత స్క్రాప్ ఈ నెల 16వ తేదీ తర్వాత డిస్పోస్ చేసే విధంగా చూడాలన్నారు. ఫిమేల్ మెడికల్ వార్డు వద్ద మరమ్మతులు పూర్తి చేసిన తర్వాత ఆ స్థలానికి పార్కింగ్ ఏర్పాటయ్యే విధంగా చూడాలని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశించారు. ఎస్ఐసీయూ విభాగంలో బాత్‌రూమ్, డ్రైనేజ్ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని శానిటేషన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. ఆసుపత్రిలో పలు విభాగాల వద్ద సిమెంట్ చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని శానిటేషన్ సిబ్బందికి చెప్పారు. గైనిక్ ఐసీయూ వద్ద రోగులు కూర్చునేందుకు కుర్చీలను ఏర్పాటు చేయాలని ఆర్ఎంఓకు సూచించారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, వైద్యాధికారులు ఉన్నారు.

పక్కాగా పశుగణన

- సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు సర్వే
- శిక్షణా కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జేసీ సూచనలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జేసీ మధుసూదన్‌రావు

కర్నూలు(అగ్రికల్చర్): అఖిల భారత పశుగణన కార్యక్రమంపై ఎన్యూమరేటర్లు అవగాహన పెంచుకొని కచ్చితత్వంతో చేపట్టాలని ఇన్‌చార్జ్ జేసీ, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు సూచించారు. కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశు వైద్యశాల ప్రాంగణంలో పశుగణనపై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విధి విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు పశుగణన జరుగుతుందని, మొబైల్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు. ఇందుకు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ డైరెక్టర్ గుడివాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పశుగణనపై ఈ నెల 6, 7, 8 తేదీల్లో ఆదోని డివిజన్‌లో శిక్షణా కార్యక్రమాలు పూర్తి చేశామని, కర్నూలు డివిజన్‌లో శుక్రవారం నాటితో శిక్షణ పూర్తవుతుందన్నారు. ప్రతి 2 వేల ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్ ఉంటారని, దాదాపు 200 మంది ఎన్యూమరేటర్లు పశుగణనలో పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు. పారా సిబ్బంది, ఏహెచ్ఏలు, గోపాలమిత్రలను ఎన్యుమరేటర్లుగా నియమించినట్లు తెలిపారు. ప్రతి ఐదుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ ఉంటారని, సూపర్‌వైజర్లుగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంటు డైరెక్టర్లు వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి పశువులతో పాటు పెంపుడు జంతువులన్నింటినీ లెక్కించి మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. సందేహాలుంటే సూపర్‌వైజర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. వీధి కుక్కలు, ఇతరత్రా పెంపకం లేని పశువుల వివరాలను గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి తీసుకొని యాప్‌లో నమోదు చేయాలన్నారు. కర్నూలు డివిజన్ డీడీ డాక్టర్ దుర్గాప్రసన్న బాబు, బహుళార్థ పశు వైద్యశాల డీడీ హేమంత్‌కుమార్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రాజశేఖర్, ఏరియా పశు వైద్యశాల ఏడీలు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కర్నూలు(సెంట్రల్): కేరళ వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ సాయం చేయాలని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల పిలుపునిచ్చారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టారు. కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్, మార్కెట్ యార్డు, కూరగాయల మార్కెట్, కొత్తబస్టాండ్, సీక్యాంపు తదితర ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు. ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ సాయం చేయాలని కోరారు. నాయకులు పీఎస్ రాధాకృష్ణ, టి.రాముడు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కిడ్నాప్ కలకలం

కర్నూలు: కల్లూరు మండలం సల్కాపురం గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుశాల్ కిడ్నాప్ వ్యవహారం నగరంలో కలకలం రేపింది. శ్రీరాం నగర్ – గణేష్ నగర్ సర్కిల్ వద్ద కొంతమంది వ్యక్తులు గురువారం ఉదయం ఏపీ 07 బీయూ 6666 కారులో వచ్చి ప్రవీణ్‌కుశాల్‌తో గొడవ పడి బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. సాయంత్రం వరకు అతని ఆచూకీ లభించకపోవడంతో తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రవీణ్‌కుశాల్ వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఆర్థికపరమైన లావాదేవీల వల్లే కిడ్నాప్ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

అబ్బాస్ నగర్‌లో చైన్‌స్నాచింగ్

కర్నూలు: స్థానిక అబ్బాస్ నగర్‌లో గొలుసు దొంగ హల్‌చల్ సృష్టించాడు. కాలనీలో నివాసముంటున్న సునీల అలియాస్ మల్లీశ్వరి నాగులచవితి పండుగను పురస్కరించుకుని గురువారం ఉదయం సమీపంలోని ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఆమెను సమీపించి మెడలో ఉన్న పుస్తెల గొలుసును లాక్కొని ఉడాయించాడు. ఆమె తేరుకుని కేకలు వేసేలోగా వాహన వేగం పెంచి పక్క సందులో నుంచి పరారయ్యాడు. దుండగుడు 4 తులాల పుస్తెల గొలుసును లాక్కెళ్లినట్లు బాధితురాలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

12 నుంచి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14వ తేది వరకు రెఫ్రెషర్ శిక్షణను ఇవ్వనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసర రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్క్రూటినీ, స్ట్రీట్ లైటింగ్ తదితర అంశాలపై శిక్షణ నిర్వహిస్తామన్నారు. కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీఓ, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్‌గా ఈఓఆర్‌డీ వ్యవహరిస్తారన్నారు. శిక్షణ వ్యయాన్ని ఆర్‌జీఎస్ఏ నిబంధనల మేరకు డీపీఆర్సీ నుంచి విడుదల చేస్తామన్నారు. మండల కేంద్రంలో శిక్షణ నిర్వహించే హాల్‌లో ఎల్‌సీడీ ప్రొజెక్టర్ విత్ స్క్రీన్, సౌండ్ సిస్టమ్, డెస్క్‌టాప్ కంప్యూటర్, వైట్ బోర్డు, కుర్చీలు, టేబుల్స్, మార్కర్ పెన్నులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు సిట్టింగ్ చార్జెస్ కింద సర్పంచ్‌లకు రూ.100 చెల్లించాలని, శిక్షణా వివరాలను టీఎంపీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందుకు సంబంధించి సలహాలు, సూచనల కోసం కె.జ్యోతి(కర్నూలు జిల్లా, సెల్ నెం.8520017877), డీఆర్ అరుణ్‌కుమార్(నంద్యాల జిల్లా, సెల్ నెం .7288877901).. ఇతర వివరాలకు డీటీఎం గిడ్డేశ్వర్లు, డీపీఆర్సీ సహాయకులు బీఎస్‌కే రాజవర్ధన్‌ను సంప్రదించాలన్నారు.

నేడు పశుసంవర్ధక శాఖ అధికారుల విచారణ

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 1, 2 తేదీల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్న వెటర్నరీ పారా సిబ్బంది, వెటర్నరీ డాక్టర్ పట్ల కల్లూరు ఏరియా పశు వైద్యశాల డాక్టర్ పార్థసారధి అనుచితంగా వ్యవహరించారనే ఫిర్యాదుపై కర్నూలు బహుళార్థ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్ ఈ నెల 9న విచారణ జరుపనున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పింఛన్ల పంపిణీలో పాల్గొనగా.. దీన్ని డాక్టర్ పార్థసారధి తప్పుపడుతూ తమపై దురుసుగా ప్రవర్తించారని వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి పశువైద్యురాలు స్వాతి, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు రామ్మోహన్, రేఖరాణి తమ అసోసియేషన్ నేతల ద్వారా జిల్లా జాయింట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జేడీ వెటర్నరీ పాలిక్లినిక్ డీడీని విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం విచారణ జరుపనున్నారు. ఫిర్యాదుదారులతో పాటు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోషియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు విచారణకు హాజరు కానున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆటోలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ గౌతమి

కర్నూలు: కర్నూలు నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి బళ్లారి చౌరస్తా వరకు తనిఖీలు చేపట్టారు. రోడ్డుపై ఆటోలను అడ్డదిడ్డంగా నిలపడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరిగి వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు గురువారం ఉదయం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోలకు సంబంధించిన రికార్డులు, డ్రైవర్ల లైసెన్సులు పరిశీలించారు. డాక్యుమెంట్లు సరిగా లేని ఆటోలను ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించి మోటర్ వాహనాల చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ సీఐ గౌతమి కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వ్యవహరిస్తే నూతన చట్టాల ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అలాగే సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు రాజ్‌విహార్, మౌర్యా ఇన్, వై–జంక్షన్ ట్రాఫిక్ పాయింట్లలో మైనర్ డ్రైవింగ్‌పై తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడుతున్న మైనర్లను అదుపులోకి తీసుకుని వారి వాహనాలను ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు సీఐ తెలిపారు.

విపత్తులను ఎదుర్కోవడంపై అవగాహన



తాండ్రపాడు జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

కర్నూలు: వరదలు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్‌కు చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సూచించింది. కమాండెంట్ ప్రభుకుమార్ ఆదేశాల మేరకు కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం విపత్తులను ఎదుర్కొనే జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ డీఎస్పీ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ విధులు, విపత్తుల సమయంలో నిర్వహించే పాత్ర గురించి విద్యార్థులకు చక్కగా వివరించారు.ఎస్ఐ చంద్రశేఖర్ నాయక్, బృందం సభ్యులు ప్రాక్టికల్‌గా బోధించారు. విపత్తులు సంభవించినప్పుడు విద్యార్థులనుఎలా కాపాడుకోవాలో డెమో రూపంలో ప్రదర్శించారు. వారు ఉపయోగించే వివిధ పరికరాలు, వాడే విధానాన్ని చూపించారు. హెచ్ఎం లక్ష్మీ శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈత పోటీలకు రిజిస్ట్రేషన్లు

కర్నూలు (టౌన్): నరసరావుపేట పట్టణంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న 10వ సీనియర్ అంతర్ జిల్లాల ఈత పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేస్తున్నట్లు జిల్లా ఈత సంఘం కార్యదర్శి రామకృష్ణయాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన క్రీడాకారులు స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డుతో స్థానిక కిసాన్‌ఘాట్ వద్ద ఉన్న స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీలోపు సంప్రదించాలన్నారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల సమయంలో కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే 15 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన క్రీడాకారులు వాటర్ పోలోకు అర్హులని తెలిపారు. వివరాలకు 92927 57888 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'రెజ్లర్‌పై అనర్హత వేటు' ఆంతర్యం బయటపెట్టాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఒలింపిక్స్ క్రీడల్లో ఫైనల్‌కు చేరిన భారత రెజ్లర్ వినేష్ ఫొగాట్ 100 గ్రాములు బరువు ఎక్కువగా ఉందంటూ అనర్హత వేటు వేయడంలో ఆంతర్యాన్ని బయటపెట్టాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ.. ప్యారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించాల్సిన రెజ్లర్ వినేష్ ఫొగాట్‌పై అర్ధాంతరంగా అనర్హత వేటు వేయడం దేశానికే ఆశ్చర్యం కలిగించిందన్నారు. రాత్రి సెమీఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన ఆమెపై ఉదయానికల్లా బరువు పెరిగిందంటూ వేటు వేయడం దేశ ప్రజలను షాక్‌లోకి నెట్టిందన్నారు. పతకం సాధించే సమయంలో బరువు పరీక్షించి 100 గ్రాములు ఎక్కువగా ఉన్నట్లు చెప్పి తొలగించడంలో కుట్ర కోణం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. గతంలో క్రీడా శాఖలో జరుగుతున్న లైంగిక వేధింపులపై ఆమె బహిరంగంగా ఆరోపణలు, ఆందోళనలు కూడా చేశారని గుర్తుచేశారు. క్రీడాకారులపై రాజకీయ కక్ష సాధించాలనుకోవడం అవివేకమన్నారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి, హుస్సేన్‌బాష, నాయకులు అబుబాకర్, ఆర్యన్, భాస్కర్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కల్పించండి

కర్నూలు: నూతన చట్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ హెడ్ క్వార్టర్స్ ఇన్‌చార్జ్ సాయిప్రదీప్ ఎస్పీ బిందుమాధవ్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన్ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలపై విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విన్నవించారు. బీజేపీ నాయకులు కేశవ చౌదరి, ఉమామహేశ్వరప్ప, జగదీష్, నవీన్ కుమా ర్, భరత్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తరగతులకు హాజరుకావాలి

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్రమంతప్పకుండా తరగతులకు హాజరుకావాలని వీసీ ఎన్‌టీకే నాయక్ సూచించారు. ఆయన గురువారం ఇంజినీరింగ్ బ్లాక్, హాస్టళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్న స్థానాలకు చేరుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చీఫ్ వార్డెన్ సి.విశ్వనాథరెడ్డి వెంట ఉన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

కర్నూలు(సెంట్రల్): స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్స్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులచే మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 మందికిపైగా విద్యార్థులు రక్తదానం చేశారు. వారికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి పాల్గొన్నారు.

సామాజిక సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): సామాజిక సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చొరవ చూపాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం దళిత్ సోషల్ ముక్తి మంచ్ ఇచ్చిన పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట కేవీపీఎస్, రజక వృత్తిదారులు, కాటికాపరి, గుంతలు తీసే బేగరుల సంఘం, చర్మకార వృత్తిదారులు, దళిత ఉద్యోగులు, దళిత మహిళా, స్కావెంజర్స్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులకు నేటికీ కూడు, గూడూ లేకపోవడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అన్నారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక సర్వే నిర్వహించి వెనుకబడిన వర్గాలను అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సి.గురుశేఖర్, ఎన్ జీ కృష్ణ, అబ్దుల్లా, ఆథోని, రాజ్‌కుమార్, విజయమ్మ,మారేళ్ల రామాంజనేయులు పాల్గొన్నారు.